# ప్రజల దీవెనలతో హ్యాట్రిక్ విజయం సాధిస్తా..

- **కూకట్‌పల్లిలో వేలాది కోట్లతో అభివృద్ధి**
- **చేసిన పనులను చూసి ప్రజలు ఆశీర్వదిస్తారు**
- **ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



కూకట్‌పల్లిలో నామినేషన్ ఘట్టంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పక్కన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 9 : సీఎం కేసీఆర్ ఆశీర్వాదం, ప్రజల దీవెనలతో మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం కూకట్‌పల్లి ఆర్‌వో కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పదేండ్ల కాలంలో.. తెలంగాణ రాష్ట్రం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధిని సాధించిందని.. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం కొనసాగుతుందని.. సీఎం కేసీఆర్ పాలనపట్ల యావత్ ప్రజానికం సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్, తాగునీటి సమస్యలను పరిష్కరించానని.. ఖాళీ స్థలాలను పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దానని, డ్రైనేజీ, రోడ్లను బాగుచేశానని తెలిపారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలతో పాటు.. ఇవ్వని హామీలను కూడా నెరవేర్చినట్లు తెలిపారు. ప్రజలందరికి అందుబాటులో ఉంటూ.. నిరంతరం సేవలందించానన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యేగా అందించిన సేవలను గుర్తిస్తూ సీఎం కేసీఆర్ మరోసారి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. కూకట్‌పల్లిలో భారీ మెజార్టీతో విజయం సాధించి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందిస్తానన్నారు. ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్లు.. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.



కూకట్‌పల్లి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్



కూకట్‌పల్లి మసీదులో ప్రార్థనలో.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## బీఆర్ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ..



ఎమ్మెల్యే కృష్ణారావు నామినేషన్ ర్యాలీలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 9 : కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు నామినేషన్ ఘట్టం అట్టహాసంగా సాగింది. గురువారం కూకట్‌పల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.శ్యాంప్రకాశ్‌కు మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కలిసి నామినేషన్ పత్రాలను అందజేశారు. ముందుగా కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని సిద్ధి వినాయక దేవాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కూకట్‌పల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు కుటుంబ సభ్యులు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కార్పొరేటర్లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

కూకట్‌పల్లి మసీద్‌లో మత పెద్దల ఆశీర్వాదం తీసుకుని.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చివరగా.. కన్నతల్లి ఆశీర్వాదం తీసుకుని.. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్ వేశాడు. నామినేషన్ ఘట్టంలో కో-ఆర్డినేటర్ సతీశ్ అరోరా,కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, పగుడాల శిరీషాబాబురావు, సబీహాబేగం, పండాల సతీశ్‌గౌడ్, ముద్దం నర్సింహాయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, జిల్లా మైనార్టీటి అధ్యక్షుడు గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు కాండూరి నరేంద్రాచార్య, పగుడాల బాబురావు, తూము శ్రవన్‌కుమార్, ఆయా డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యనేతలు ఉన్నారు.

# పేదింటికి పెద్దన్నలా సీఎం కేసీఆర్

- **కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో.. ఆడబిడ్డ తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా**
- **కూకట్‌పల్లిలో 11వేల మందికి సాయం**

బాలానగర్, నవంబర్ 9 : పేదింట్లో ఆడబిడ్డ పెండ్లి చేయాలంటే తల్లిదండ్రులు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. వధువుకు తగిన వరుడు.. వరుడుని చూసి పెండ్లిచేసి సంతోషంగా ఆబిడ్డను అత్తారింటికి పంపే తల్లిదండ్రుల కష్టాలు తెలిసినవే. పేదింట్లో ఆడబిడ్డ పెండ్లి చేయాలంటే పొలం, ఇంటిని అమ్ముకోవడం లాంటి కష్టాలు తెలంగాణ ప్రతి పల్లెలో, పేద వాడలలో కనిపించేవి. తెలంగాణ పల్లెల్లో ఈ కష్టాలన్నీ స్వయంగా చూసిన సీఎం కేసీఆర్ ఆడబిడ్డ పెండ్లికి ప్రభుత్వం నుంచి సాయమందించాలన్న సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సంక్షేమ పథకాలను తీసుకొచ్చారు. 2014 అక్టోబర్ 2వ తేదీన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వచ్చాయి. 18 సంవత్సరాలు నిండిన పేదింటి ఆడబిడ్డకు పెండ్లి ఖర్చులకుగాను రూ.51,116 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించింది. 2017లో ఈ పథకాల ద్వారా ఆర్థిక సాయాన్ని రూ.75,116కు పెంచారు. 2018 మార్చిలో ఈ ఆర్థిక సాయాన్ని 1,00,116లకు పెంచి ఆడబిడ్డల తల్లిదండ్రుల కన్నీళ్లను పెద్దకొడుకులా సీఎం కేసీఆర్ తుడిచాడు. అలాగే దివ్యాంగులైన ఆడబిడ్డల పెండ్లి ఖర్చులకు ఈ పథకాల ద్వారా రూ.1,25,116లు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో తెలంగాణలో బాల్య వివాహాలు కూడా తగ్గుముఖం పట్టాయి.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులను అందజేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు (ఫైల్)

**కూకట్‌పల్లిలో 11 వేల మందికి సాయం..**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా 11.58 వేల మందికి ఆడబిడ్డల పెండ్లీలకు ఆర్థిక సాయం అందింది.

**పేదలకు భరోసా..**



పేదింటి ఆడబిడ్డ పెండ్లి కోసం సీఎం కేసీఆర్ రూ.1,00,116 (లక్షానూటాపదహారు) ఆర్థిక సాయం అందించడం సంతోషంగా ఉంది. మొదట ఆడబిడ్డ పెండ్లి చేయడానికి ఖర్చులకు భయపడ్డాం. ఆడబిడ్డ పెండ్లి కాగానే దరఖాస్తు చేసుకున్నాం. ఎక్కడా.. ఎవరికీ రూపాయి ఇవ్వకుండానే రూ.1లక్ష 116ల చెక్కు చేతికి అందించారు. సీఎం కేసీఆర్ లాంటి నాయకుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టం. మాతో పాటు ఆడబిడ్డల పెండ్లి చేసిన తల్లిదండ్రులంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– పుష్పాల పుష్ప, నాగార్జుననగర్, ఫతేనగర్

మరోసారి గెలిపించండి..

# మరిన్ని సేవలందిస్తా

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, నవంబర్ 9 : అభివృద్ధిని చూసి మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. గురువారం ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని కార్పొరేటర్ నర్సింహాయాదవ్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా తాను మూడోసారి ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. ఈ దఫా ఎన్నికలలో మరోసారి కారుగుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మూడోసారి ప్రజల మద్దతుతో గెలిచి హ్యాట్రిక్ సాధించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మెరుగైన సమర్థపాలన అందించబడుతుందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ గెలుపుతోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నవంబర్ 30న జరిగే శాసన సభ ఎన్నికలలో కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజల పట్ల సానుకూల దృక్పథంలో ఉన్న సీఎ కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు మూడోసారి పట్టం కట్టనున్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, మక్కల నర్సింగ్, సయ్యాద్ ఎజాజ్, ఇర్ఫాన్, ఏనుగుల తిరుపతి, చారీ, వీరు, రాజుగౌడ్ మహిళలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు. శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా మూడోసారి ఎన్నికల బరిలో నిలిచేందుకు నిమినేషన్ పత్రాలు దాఖలు చేసిన సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావుకు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అంటే ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందన్నారు. ఈ దఫా జరిగే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ విజయదుందుబి మోగించడం ఖాయమన్నారు.

## కూకట్‌పల్లి అభివృద్ధి ప్రదాత మాధవరం



ఓటర్లకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అందజేస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్,నవంబర్9: కూకట్‌పల్లి నియోజకర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే మాధవరం కారుగుర్తు కు ఓటు వేసి గెలపించాలని అల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సబీహాబేగం కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని సఫ్ధార్‌నగర్‌లో ఆ పార్టీ శ్రేణులతో కలిసి కార్పొరేటర్ ఇంటింటికి వెళ్లి మ్యానిఫెస్టోను అందజేసి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## జోరుగా నామినేషన్లు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 9 : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గం బరిలో నిలిచేందుకు జోరుగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పర్వం రేపటితో ముగియనుండటంతో ఇప్పటి వరకు 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం 9వ తేదీతో పాటు.. ఏకాదశి శుభ ముహూర్తం కావడంతో ప్రధాన పార్టీలతో పాటు 9 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేశ్, జనసేనా పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌లతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను వేశారు. వివిధ పార్టీల నాయకులు ర్యాలీలతో వచ్చి నామినేషన్లు వేయడంతో కూకట్‌పల్లి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఎన్నికల సందడి కనిపించింది.

**నామినేషన్ వేసిన అభ్యర్థులు..**

మాధవరం శివయ్యగారి కృష్ణారావు (బీఆర్ఎస్), బండి రమేశ్ (కాంగ్రెస్), ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ (జనసేన), సండ్రా సునీల్‌కుమార్ (ధర్మా సమాజ్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా కె.బాలమణి, బండి లకుమాదేవి, అరెకపూడి వెంకటబాలకృష్ణ, కలాం దినేశ్, ముదుపురం సతీశ్ లు నామినేషన్ వేశారు.